# Communist Party of India (Marxist)

**Greater Hyderabad Central City Committee**

1-7-144, Golconda 'X' Roads, Musheerabad, Hyderabad-500 020, Ph.27609083

**E.mail:cpmhydcommittee@gmail.com**

Secretary : **M.Srinivas** 9490098661


**ప్రచురణార్థం :** **తేది : 21-09-2022**

## కార్మికులను దోచుకుంటున్న కాంట్రాక్టు ఏజెన్సీలపై విచారణ జరపాలి
## అర్హతలేని కాంట్రాక్ట్ ఏజెన్సీలను రద్దు చేయాలి
## ఏజెన్సీల కేటాయింపు విధానం మార్చండి - సి.పి.ఎం. డిమాండ్

ప్రభుత్వ విభాగాల్లో పనిచేస్తున్న లక్షన్నర మంది ఔట్‌సోర్సింగ్ కార్మికులకు సక్రమంగా వేతనాలు చెల్లించకుండా, ఇ.ఎస్.ఐ., పి.ఎఫ్. లు చెల్లించ కుండా కాంట్రాక్టు ఏజెన్సీలు అడ్డగోలుగా దోచుకుంటున్నాయి. ప్రతినెల మొదటి వారంలోనే జీతాలు చెల్లించాల్సి ఉండగా అనేక ఏజెన్సీలు నెలల తరబడి కార్మికులకు జీతాలు చెల్లించడం లేదు. ప్రభుత్వం నుండి నిధులు విడుదల కాకపోయినా కాంట్రాక్ట్ ఒప్పందం ప్రకారం మూడు నెలలపాటు కార్మికులకు జీతాలు ఇవ్వాల్సిన బాధ్యత ఏజెన్సీదే అయినప్పటికీ ఏ ఒక్క ఏజెన్సీ ఈ నిబందన పాటించడం లేదు. కొన్ని నెలలకు సంబంధించిన జీతాలు ఒకేసారి చెల్లిస్తూ అందులో పెద్ద మొత్తంలో కోత కోస్తూ కార్మికులను దోచుకుంటున్నాయి. రాష్ట్ర ఇ.ఎస్.ఐ. డైరెక్టరేట్లో 'హెచ్.ఎస్.ఆర్.ఆర్. ప్లేస్‌మెంట్ సర్వీసెస్' అనే సంస్థ కార్మికులకు చెల్లించాల్సిన 13 నెలల బకాయి వేతనాల్లో 40 లక్షలు కాజేసింది. ఈ సంస్థపై ఫిర్యాదు చేసినప్పటికీ నేటికీ ఎలాంటి చర్య తీసుకోలేదు. జిహెచ్ఎంసి పార్కుల్లో పనిచేస్తున్న వందలాది మంది కార్మికులకు కనీస వేతనాలు చెల్లించకుండా, ఇఎస్ఐ, పిఎఫ్ లు చెల్లించ కుండా ఎక్కువ మంది కాంట్రాక్టర్లు ఎగవేస్తున్నారు. కార్మికులు అడిగితే తక్షణమే పనుల్లోంచి తొలగిస్తున్నారు.

కాంట్రాక్ట్ ఏజెన్సీ పీరియడ్ ఒక ఏడాది మాత్రమే ఉండడం కూడా మరింత దోపిడీకి ఆస్కారం కల్పిస్తున్నది. కాంట్రాక్టు ఏజెన్సీ కేటాయింపులో, ఒప్పందం చేసుకోవడంలో, నిధుల విడుదలలో నెలల తరబడి కాలం గడవడం కారణంగా కార్మికులకు జీతాలు చెల్లించే సమయం నాటికే ఏజెన్సీ ఏడాది గడువు కూడా ముగిసి పోతున్నది. ఈ ఏజెన్సీలు ఇ.ఎస్.ఐ., పి.ఎఫ్. లు కూడా చెల్లించ కుండానే తమ జేబుల్లో వేసుకుని వెళ్ళి పోతున్నాయి. ఏడాదికోసారి ఏజెన్సీ మార్పుతో కార్మికుల్లో గందరగోళం ఏర్పడుతున్నది. కాంట్రాక్టర్లు పాత కార్మికులను తొలగించి కొత్త కార్మికులను పెట్టుకుంటూ వేల రూపాయిలు దండు కుంటున్నారు. దశాబ్దాలుగా పనిచేస్తున్న వర్కర్లను కూడా అడ్డగోలుగా తొలగిస్తున్నారు.

తగిన అర్హత, అనుభవం, ఆర్థిక స్తోమత కూడా లేని ఏజెన్సీలకు కాంట్రాక్ట్ పనులు కేటాయిస్తూ అధికారులు భారీగా ముడుపులు పొందుతున్నారు. హైదరాబాద్ జిల్లాలో ప్రస్తుతం 55 కాంట్రాక్టు ఏజెన్సీలు వివిధ ఔట్సోర్సింగ్ పనులను నిర్వహిస్తున్నాయి. మెజారిటీ సంస్థలు నిబందనలను పాటించక పోయినా ఏ ఒక్క ఏజెన్సీపై అధికారులు చర్యలు తీసుకున్న పరిస్థితి లేదు.

కాంట్రాక్ట్ ఏజెన్సీల నియామక పద్ధతి, నిధులు విడుదలలో తీవ్ర జాప్యం, ఏజెన్సీలపై తగిన పర్యవేక్షణ లేకపోవడం, నిబంధనలు ఉల్లంఘించిన ఏజెన్సీలపై ఎలాంటి చర్యలు లేక పోవడంతో కార్మికులు తీవ్రంగా దోపిడీకి గురవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టు ఏజెన్సీల దోపిడీపై విచారణ జరిపి కార్మికుల రక్షణకు తక్షణమే చర్యలు చేపట్టాలని, ఔట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని సిపిఎం డిమాండ్ చేస్తున్నది.

**(ఎం.శ్రీనివాస్)**

కార్యదర్శి